
# పబ్లిసిటీ ప్రహసనం




గుప్తులనాటి కాలాన్ని స్వర్ణయుగమన్నారు చరిత్ర రాసిన రచయితలు. అలాగే ప్రస్తుత కాలాన్ని "ప్రకటనలు లేక పబ్లిసిటీ యుగం"గా మనం మొఖవాటం లేకుండా చెప్పుకోవచ్చు. రచయితలు రాసేయవచ్చు. మరికొంతకాలంపోతే ఈ వ్యాపారప్రకటనలు ఏ పద్ధతి కొస్తాయో ఎవరయినా తేలిగ్గా ఊహించుకోవచ్చు.

ఆనాడు మన నిర్భయ్‌గనర్ కాలనీ లైఫ్ ఇదిగో ఇలా వుంటుంది! ఇక చదవండి!

నేనూ, శాయిరామ్, రంగారెడ్డి, జనార్ధన్ కలిసి ఆఫీస్ కెళ్ళడానికి బయల్దేరి బస్‌స్టాప్ దగ్గరకొచ్చాము. అక్కడ రష్ చాలా ఎక్కువగా ఉంది.

"అబ్బ! రష్ బాగా ఉందే?" అన్నాడు శాయిరామ్.

అనటమే ఆలస్యం ఓ వ్యక్తి మా వెనుక నుంచి సర్రున ముందుకి దూసుకొచ్చాడు. "అవున్సార్! ఎక్కడ చూచినా రష్! ఎటు చూచినా రష్! రైళ్ళల్లో బస్సుల్లో, షిప్పుల్లో, విమానాల్లో, రోడ్లమీద, ఆఫీసుల్లోనూ, అంతా రష్! అన్నీ రష్! అంచేత మీరూ నేడే వాడండి రష్! కమ్మని కమనీయమయిన కూల్‌డ్రింక్ పౌడర్ రష్! రొటీన్లకూ, ప్రోటీన్లకూ తెగ తాగండి రష్! పౌడర్‌తో చేసిన పానీయం! ఒక పాకెట్ రష్ పౌడర్– ఎనిమిది బిందెల నీళ్ళను

కమ్మని రసమయ రసంగా మార్చేస్తుంది. ఆరొందల మందికి సరిపోతుంది. ఎవరికి సార్ కూల్‌డ్రింక్ పౌడర్" అంటూ తన బాగ్‌లో నుంచి రష్ పాకెట్లు తీసి మాకివ్వబోయాడతను.

"మాకొద్దు నాయనా!" అన్నాడు రంగారెడ్డి షాక్ నుంచి తేరుకుని.

"అదేమిటి సార్! రష్ బాగా ఉందే అని మీరనుకోవటం నేను వినలేదనుకున్నారా?" అతనిని వదిలించుకునేసరికి పావుగంట పట్టింది. ఇంతలో మా మధ్యకు ఏదో జంతువు దూరినట్లనిపించింది.

ఆ జంతువుని చూసి రంగారెడ్డి కెవ్వున కేకవేసి అవతలివేపుకి ఒక్కగెంతు గెంతాడు. ఆ గెంతుకి అక్కడ నిలబడ్డ ఓముసలాయన అటువేపు నిలబడ్డ ఇద్దరు స్త్రీలమీద పడ్డాడు. వాళ్ళు కింద చతికల బడుతూ ఇంకొకాయన కాళ్ళుతొక్కారు. ఆ కాళ్ళ ఓనరు "నాయనోయ్! నా కాళ్ళు పచ్చడి అయిపోయాయ్ దేవుడో" అంటూ ఆ లావుపాటావిడను బూతులు తిట్టసాగాడు.

ఈ చైన్ రియాక్షన్ ఓపక్క జరుగుతూండగానే నేనూ, శాయీరామ్ కలసి మా మధ్యకొచ్చిన ఆ జంతువేమిటా అని పరీక్షగా చూశాము.

రంగురంగుల బొచ్చులో నుంచి తెలుగు అక్షరాలు స్పష్టంగా కనబడుతున్నాయ్. "అత్తమొగుడే నా మొగుడు! నేడే చూడండి! అద్భుతమైన సెంటిమెంటల్ చిత్రం! పధ్నాలుగు థియేటర్లలో నేడే విడుదల!" అని రాసి ఉంది.

ఆ జంతువు తోకమీద తారాగణం పేర్లున్నాయి..

ఆ జంతువు నెమ్మదిగా మా దగ్గరకొచ్చి తోకాడించాకగానీ మాకు తెలీలేదు అది కుక్క అని. ఏ జంతువో ఓ పట్టాన తెలీటంలేదు. మనిషి మొఖంలా ఉంది కానీ, దాని మొఖానికి కూడా రంగులు పూసి ఈ రంగులతో ఆ సినిమాలోని హీరో మొఖం కనిపించేటట్లు చేశారు. అంచేత మేము కొంచెం కన్ఫ్యూజ్ అయ్యాము.

"ఇది కుక్కరా!" అన్నాడు జనార్ధన్ రంగారెడ్డికి ధైర్యం చెప్తూ.

"అవునవును! ఇది కుక్కే! ఊరకుక్క. ఈ మధ్య సినిమా కంపెనీవాళ్ళు కుక్కలూ, పందుల మీదే రంగులేసి కొత్త పిక్చర్ల పబ్లిసిటీ ఇస్తున్నారు" అంటూ చెప్పాడో స్టూడెంట్!

ఇంతలో ఓ సిగరెట్ కంపెనీ వాన్ వచ్చి ఆ బస్‌స్టాప్ దగ్గర ఆగింది.

"మినిష్టర్ సిగరెట్లనే వాడండి! అయిదు సంవత్సరాల పాటుకాలుతూండే ఏకైక సిగరెట్లు – మినిష్టర్ సిగరెట్లు! ధారాళమయిన పొగకి నేడి వాడండి! మినిష్టర్ సిగరెట్లు!" ఇలా ఆ వాన్ అంతా బొమ్మలతో పాటు రాసి ఉంది.

ఆ వాన్‌లోని వాళ్ళు దిగి మమ్మల్ని సిగరెట్లు ఎక్కడ కొనమంటారోనని మేము బాగా వెనక్కి జరిగి నిలబడ్డాము. వాళ్ళు మా అందరికీ శాంపుల్ సిగరెట్లు ఇచ్చి, వాళ్ళే లైటర్‌తో

అంటించి "ఈ మినిష్టర్ సిగరెట్లు మీకెందుకు అంత బాగా నచ్చినయ్?" అనడిగారు. "నచ్చాయని ఎవడన్నాడు?" అని నేనంటూండగానే మైక్ నాముందు నుంచి లాగేసి రంగారెడ్డి ముందుంచారు. 'మిగతా అన్ని సిగరెట్ల కంటే దీని రుచి అద్భుతం' అని చెప్పండి సార్ అంటూ వందనోటు గిఫ్టుగా ఇచ్చారు. అంతే! రంగారెడ్డి ఆ మినిష్టర్ సిగరెట్లను అరగంట పొగిడాడు. నిజానికి రంగారెడ్డి సిగరెట్లు తాగటం అదే మొదటిసారి! మరి కాసేపటికి ఆ వాన్ వెళ్ళిపోయింది. కానీ ఈ సారి అప్పడాల వ్యాన్ వచ్చింది

"ముద్ద ముద్దకీ మధ్య అప్పడం! మనిషి మనిషికీ మధ్య అప్పడం! నేడే వాడండి జుబేగా వారి అప్పడాలు! మనిషి శరీరం పెరుగుదలకూ– ఆరోగ్యానికీ అవసరమైన ఇరవై ఎనిమిది రకాల ఖనిజాలతో తయారు చేయబడినాయ్ జుబేగా కంపెనీ వారి అప్పడాలూ!" ఆ వాన్ కూడా వెళ్ళిపోయింది గానీ– ఇంకా మా సెక్రటరియట్ బస్‌రాకపోయేసరికి చిరాకు పుట్టుకొచ్చింది. "థూ! ఒక్క బస్‌కూడా టైమ్‌కి రాదు" అన్నాడు రంగారెడ్డి 'అనటం ఆలస్యం మా పక్కన నిలబడ్డ వ్యక్తి తన చేతి కర్రను ఒక మూడు కాళ్ళ టేబుల్ బాగా మార్చి, తన చేతిలో ఉన్న సూట్‌కేస్‌ని దానిమీద ఉంచి ఓపెన్‌చేశాడు. లోపలన్నీ వాచీలు. "ఎవరికి సార్! కైలాస్ వాచీలు! టైమ్‌పీస్‌లలు! ఏ బస్సు ఎంతలేటో గంటలు, రోజుల్తో సహా చెప్పే సూపర్ వాచీలు! ఒకటికొంటే ఒకటి ఫ్రీ సార్–" అతికష్టం మీద అతన్నుంచి తప్పించుకుంటున్నారందరూ– ఆవిషయం గట్టిగా అందామంటే మళ్ళీ ఆ "టైమ్ సెట్టర్" కంపెనీ తాలూకు పార్ట్‌టైమ్ పెద్దమనిషి ఎక్కడ చుట్టుముడతాడోనని భయం!

కాని ఆ విషయం పట్టించుకోకుండా శాయీరామ్ మాత్రం "ఇవాళ ఒక్క సెక్రటేరియట్ బస్‌కూడా రావటంలేదేమిటి?" అన్నాడు చిరాకుగా.

మా పక్కనున్న చెమ్కీటోపీ సాయిబుగారు నవ్వారు.

"ఇప్పుడే గదండీ– సెక్రటేరియట్ బస్‌లు రెండు వెళ్ళాయ్!" అన్నాడతను. మేము ఉలిక్కిపడ్డాము.

"సెక్రటేరియట్ బస్‌లు వెళ్ళాయా?"

"అవునూ!"

"మేము ఇక్కడ నిలబడి అరగంటవుతోంది! మాకే బస్సూ కనిపించలేదే!"

"ఇప్పుడే మీ కళ్ళముందే రెండు బస్సులు వెళ్ళాయి కదండీ!"

"ఇప్పుడు వెళ్ళినవి రెండు అప్పడాల కంపెనీ వాన్‌లు! వాటినే చూసి నువ్వు బస్ అనుకున్నావేమో!" అంటూ తిరగబడ్డాడు రంగారెడ్డి.

సాయిబుగారు రంగారెడ్డిని చాలా జాలిగా చూశారు.

"అవి అప్పడాల కంపెనీ వాన్‌లు కాదు నాయనా! ఆర్టీసివారి సిటీబస్‌లు!"

మాతోపాటు అక్కడున్న చాలామంది ఉలిక్కిపడ్డారు.

"అప్పడాలవాన్‌లు ఆర్టీసీ బస్‌లా"

"అవును! నిన్న పేపర్లో వేశారు కదా! చూళ్ళేదా?"

"ఏమని?"

"ఇవాల్టి నుంచీ బస్‌లకు నంబర్లు-డెస్టినేషన్ పేర్లూ ఉండవ్! కేవలం వ్యాపార ప్రకటల్ని బట్టే గుర్తుపట్టాలి!"

"అవును! నేను బ్లేడ్స్ కంపెనీ బస్ ఎక్కాలి!" అన్నాడు ఓ వ్యక్తి తన చేతిలోని డయిరీ తీసి తను వెళ్ళాల్సిన చోట కెదురుగ్గా ఉన్న ప్రకటన చూస్తూ.

"మేము సెక్రటేరియట్ కెళ్ళాలంటే ఏ బస్ ఎక్కాలండీ?" నేను ఆ పెద్దమనిషిని వినయంగా అడిగాను.

అతను మళ్ళీ డయిరీ చూశాడు.

సెక్రిటేరియట్ అని ఉన్నచోట అప్పడాల కంపెనీ అని ఉంది.

"అందుకేనయ్యా! నేను చెప్పింది! అప్పడాల కంపెనీవి మరి రెండు బస్‌లు వెళ్ళాయికదా?" నవ్వుతూ అన్నాడు సాయిబుగారు.

జనార్ధన్ ఆ పెద్దమనిషి నడిగి ఏ వ్యాపార ప్రకటన బస్ ఎక్కడి కెళ్ళుతుందో తన డయిరీలో రాసుకోసాగాడు.

ఈసారి బ్రాందీ బస్ వచ్చింది

"మందిరా బ్రాందీ- బ్రాందీ" అని అరచాడు కండక్టర్ లోపల్నుంచీ!

"అంటే! పంజాగుట్ట మీదనుంచీ వెళ్ళుతుందా?" ఒకావిడ అనుమానంగా అడిగింది.

"లేదమ్మా? విస్కీబస్ పంజాగుట్ట మీదనుంచి వెళ్తుంది! బ్రాందీ బస్ కూడా అంటే వెళ్తుంది గానీ సందుల్లో నుంచి తిరిగి వెళ్ళుతుంది!"

"మరి బీరు బస్సో?"

"బీరు బస్ అంతదూరం వెళ్ళదు మాష్టారూ! ఖైరతాబాద్ దగ్గరే ఆగిపోతుంది!" అంటూ గంట కొట్టాడతను. బస్ వెళ్ళిపోయింది. మరో పదినిమిషాల తర్వాత ఒడియాల బస్ వచ్చింది.

"అప్పడాలూ, వడియాలూ ఒకటే జాతికదా! ఇది సెక్రటేరిట్ దగ్గర కెళ్ళుతుందేమో" అన్నాడు జనార్ధన్ అనుమానంగా.

శాయిరామ్ కండక్టర్ దగ్గరకెళ్ళి వివరం అడిగాడు.

"అప్పడాలు వేరు ఒడియాలు వేరు సార్! బస్ లకడీకపూల్ నుంచి మెహిదీపట్నం పోతుంది-"

"లకడీకాపూల్‌లో దిగినడిచి వెళ్దాంలే పదండి– ఇందులో వెళ్దాం!" అన్నాడు రంగారెడ్డి.

లోపల ఎక్కడ చూసినా ఒడియాల బొమ్మలే కనబడుతున్నాయి కండక్టర్ మాత్రం చేగోడీల డిజైన్ ఉన్న యూనిఫారం వేసుకున్నాడు.

"మరేంలేదా సార్! ఒడియాల బస్ కండక్టరు రాలేదని నన్ను బుక్ చేశారు" అన్నాడతను మా ఆశ్చర్యం చూపి చిరునవ్వు నవ్వి!

మా ముందు నిలబడ్డ ఓ కళ్ళజోడు పెద్దమనిషి ఒక్కసారి భీకరంగా అరిచాడు. బస్‌లోని వాళ్ళంతా అదిరిపడి లేచి నిలబడ్డారు. ఫుట్‌బోర్డుమీద నిలబడ్డ కొంతమంది యాక్సిడెంట్ అయిందేమోనని కిందకు దూకేశారు.

"భయపడకండి సార్! మేడమ్! అశేషాంధ్రలోకాన్ని అద్భుతమైన స్పెన్స్‌తో, సరికొత్త కథలతో ఈ బస్‌లాగా ఒళ్ళు గగుర్పొడిపించే మలుపులతో ఉర్రూతలూగిస్తున్న ఆంధ్రుల అభిమాన ప్రఖ్యాత రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌గారి నవలలు ఎవరికి కావాలో ఇప్పుడే ఆర్డర్ బుక్‌చేయండి సార్! ప్రతి నాలుగు నవలలు కొన్నవారికి ఓ నవల ఉచితంగా ఇవ్వబడుతుంది. అంతేకాదు. దానిమీద రచయిత ఆటోగ్రాఫ్ కూడా ఉంటుంది.

అంతేకాదు! ఆ నవలలో ఓ తప్పు ఉంది. ఈ తప్పేమిటో కనుక్కొన్న మొదటి వెయ్యిమంది పాఠకులకు ఇంకో తప్పు కనుక్కునేందుకు "క్యూ" ఇవ్వబడుతుంది" అని మళ్ళీ భీకరంగా కేకశాడతను. ఈసారి అతని పక్కనే కూర్చున్న ఓ గర్భిణీ స్త్రీ మూర్ఛపోయింది.

బస్ ట్రాఫిక్ జంక్షన్ దగ్గర ఆగింది. పోలీస్ చేతిలో కనబడుతున్న స్టాప్‌బోర్డ్ మీద "దోమ మార్కుగల పళ్ళపొడినే వాడండి!" అని రాసి ఉంది పెద్ద అక్షరాలతో. అడుగున చిన్న అక్షరాలతో "స్టాప్" అని ఉంది.

బస్ దిగి సెక్రటేరియట్‌కి పరుగెత్తాం. "గేట్లమీద ఓ బిస్కెట్ కంపెనీ వారి పెద్ద పెద్ద హోర్డింగ్స్ కనబడుతున్నాయి. అదేమిటి– ఇక్కడ బిస్కెట్ కంపెనీ ఎప్పుడు పెట్టారు?" సెక్యూరిటీ గార్డు నడిగాము ఆశ్చర్యంగా.

"ఇవాళ్టి నుంచేనండీ!"

"మరి సెక్రటేరియట్ ఏమయింది?"

"వెనుక రాత్రి కొత్తగా వేసిన పాకల్లో పెట్టారండీ!"

"ఎందుకలా?

"బిస్కెట్ కంపెనీ వారికి– గవర్నమెంట్ వారికి కుదిరిన ఓ ఒప్పందం ప్రకారం ఈ ఏర్పాట్లు జరిగాయండీ! దీనివల్ల గవర్నమెంట్‌కి ఏటా తొంభయ్ లక్షల రూపాయలు లాభం వస్తుంది!" మేము వెనుకవేపు నడిచి కొత్తగా పాకల్లో ఏర్పాట్లు చేసిన మా ఆఫీస్‌లో కూర్చున్నాము.

"ఇవాల్టి నుంచీ ఆఫీస్ డ్రాఫ్టులకు ఈ కాగితాలే వాడండి!" అంటూ ఓ తెల్లకాగితాల కట్ట అందించాడు ప్యూను.

కాగితం ఒకవేపు తెల్లగా రెండోవేపు వ్యాపార ప్రకటనలతో నిండి ఉంది.

"భూతమ్ వారి ఎలక్ట్రిక్ ఫాన్లు ఇప్పుడు దేశంలో 90 శాతం ఉపయోగిస్తున్నారు కనుక మీరు ఈ ఫాన్ కొని శాతాన్ని పెంచండి!"

"మిగతా కాగితమంతా రకరకాల ఫాన్లబొమ్మలు–

లంచ్‌టైమ్‌లో జనార్ధన్ వచ్చాడు.

"సాయంత్రం రామ్‌కోటిలో మన సుదర్శనంగాడి సిస్టర్ మారేజ్ ఉందట.

మనల్నందర్నీ రమ్మని మరీ మరీ చెప్పాడు...." అన్నాడు

ఆఫీసవగానే అందరం కలిసే పెళ్ళికి బయల్దేరాం. నాలుగుడుగులు వేశామో లేదా మా ముందు నడుస్తున్న వ్యక్తి హఠాత్తుగా ఆగిపోయి వెనక్కు తిరిగి మా వేపు చూసి చిరునవ్వు నవ్వాడు.

"ఆహా! ఏం తెలుపు? మొఖం పగిలిపోయే తెలుపు!" అన్నాడు.

మేమంతా భయంగా వెనక్కు తగ్గాం! "వాటీజ్‌దట్?" ధైర్యం తెచ్చుకుని అడిగాడు జనార్ధన్.

"అదేనండీ! అద్భుతమయిన తెలుపు. ఇంత తెల్లగా ఎలా వచ్చిందో తెలుసా?" ఇదేదో పిచ్చి ఆసుపత్రి నుంచి తప్పించుకొచ్చిన కేసు– తెలుస్తూనే ఉంది.

ఎందుకయినా మంచిదని రోడ్డుకి మరో పక్కకు పరుగెత్తాం! కానీ అతను మా కంటే ముందు అక్కడికి చేరుకున్నాడు "మిమ్మల్నే! ఎంత తెలుపు– మొఖం పగిలే తెలుపు!" అన్నాడు మళ్ళీ చిరునవ్వుతో.

ఇంక చేసేదిలేక "అవును! పిచ్చి తెలుపు!" అన్నాడు శాయీరామ్ సపోర్ట్ చేయకపోతే అటాక్ చేస్తాడేమో అని.

"చాలా మరీ ఎక్కువ తెలుపు" అన్నాడు రెడ్డి.

"ఇంత తెలుపు ఎలా వచ్చిందో చెప్పండి?" అన్నాడతను మళ్ళీ నవ్వుతూ.

"ఇంకేముంది! మురికిపట్టిన పాతబట్టల్ని మీ కంపెనీవారి వాషింగ్ పౌడర్ వాడినందువల్ల–" అన్నాడు శాయీరామ్ సినిమాల్లో ఓ వాషింగ్ పౌడర్ పబ్లిషిటీ గుర్తు తెచ్చుకుని.

"ఛీ! మాది వాషింగ్ పౌడర్ కాదు!"

"మరి!"

"చక్రివారి రెడీమేడ్ దుస్తులు! ఇంత తెల్లగా ఎలా వచ్చాయో తెలుసా? మురికి పట్టిన పాతబట్టలు పారేసి చక్రివారి రెడీమేడ్ దుస్తులు కొన్నందువల్ల! మీరూనేడే చక్రివారి దుస్తులు కొనండి! మొఖం పగిలే తెలుపుతో తిరగండి!"

"సరే తిరుగుతాం– మీరింక మమ్మల్ని వదుల్తే..."

అతను చిరునవ్వుతో మా చొక్కలమీద చక్రివారి స్టిక్కర్‌లు అంటించి "థ్యాంక్యూ" అంటూ వెళ్ళిపోయాడు.

ఆ స్టికర్లు తీసేయడానికి మేము ఆ రోడ్ పక్కనే గంటసేపు కూర్చుని తన్నుకున్నా రాలేదు.

చేసేదిలేక అలాగే బస్‌స్టాప్ కెళ్ళి నిలబడ్డాం. బస్‌స్టాప్‌లో అంతరకూ జెంటిల్మన్‌లాగా నిలబడ్డ ఓ వ్యక్తి గట్టిగా విరగబడి నవ్వాడు.

అందరం ఇదేదో హిస్టీరియా బాపతేమో అనుకున్నాంగానీ కాదంట!

"నేను మామూలు మనిషననుకుంటున్నారు కదా! కాదండీ! ప్రఖ్యాత రచయిత రామజోగ్‌ని "భావన' వారపత్రికలో రాసే సీరియల్ నాదే! ఆ సీరియల్ మీద మీరు రాసే ఓ మాంచి ఉత్తరానికి నేను 196 ఫోజులతో కనిపించే వీడియో కాసెట్ ఉచితం" అన్నాడు. ఆ రచయితని వదిలించుకుని పెళ్ళికి వెళ్ళాం.

పెళ్ళిపందిరంతా సెంటుకంపెనీ వాళ్ళ పోస్టర్లతో నిండివుంది.

పెళ్ళికూతురిని వేదికమీద చూసి ఉలిక్కిపడ్డాం! ఆమె పక్కనే ఓ బోర్డు తగిలించి ఉంది.

"ఈమె అంబికావారి పెళ్ళికూతురు. చూడండి! ఎంత గొప్ప చీరలో! ఆహా! ఈమె ధరించిన దుస్తులన్నీ అంబికాసిల్క్ ఎంపోరియంలో సందర్శించండి– ఇట్లు – అంబికాసిల్క్ ఎంపీరియం– బాలక్ స్ట్రీట్ – కోఠి–" వెంటేనే మేము సుదర్శన్‌ని పక్కకు పిలిచాం.

"ఇదేమిటి ఆ బోర్డు...."

"ఇవాళ్రేపు అందరూ ఇట్లాగే చేస్తున్నార్లే! ఆ బోర్డు పెళ్ళి రోజంతా అలా ఉన్నందుకు గాను ఆ సిల్క్ ఎంపోరియం వాళ్ళు ఓ పట్టుచీర ఫ్రీగా ఇస్తున్నారు. కరువు రోజుల్లో అదీ ఓ లాభమే కదా?" మరి కాసేపట్లో పెళ్ళికొడుకుని తీసుకొచ్చారు. అతని నోట్లో రెండుగజాల పొడుగున్న చుట్ట ఉంది. గుప్పుగుప్పున పొగ వదులుతున్నాడతను. నెత్తిమీద మెరుస్తోన్న కిరీటం ఒకటి! దానిమీద రంగురంగులతో మెరుస్తోన్న అక్షరాలు!

"రాబందు మార్క్ చుట్టల పెళ్ళికొడుకు! పెళ్ళినాటిరాత్రి ప్రతి పెళ్ళికొడుక్కి ఆనందం కలిగించేవి రెండే రెండు. అందమైన పెళ్ళికూతురు, రాబందు మార్క్ వారి పొడుగాటి కింగ్‌సైజ్ చుట్ట!"

"మరి పెళ్ళికొడుక్కి అది తగిలించుకున్నందుకు ఆ చుట్టల కంపెనీ వాళ్ళు ఏమిస్తారు?" అడిగాడు రెడ్డి అనుమానంగా.

"ఓ సూట్ బహుకరిస్తారు! ఈ కరువు రోజుల్లో మరి అది కొనాలంటే కష్టమే కదా" అన్నాడు సుదర్శనం.

ఈలోగా ఓ పెద్దమనిషి వేదికమీద కొచ్చి పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు మధ్య నిలబడి మైక్‌లో మాట్లాడాడు. "ఈ నూతన దంపతుల ఫస్ట్‌నైట్‌ని మా ఎయిడ్స్ నిరోధక సంస్థ సమర్పిస్తోంది. నేడే మీరంతా కూడా హెచ్ఐవి పరీక్షలు చేయించుకోండి! భార్యలు, భర్తలు పరాయివ్యక్తితో అక్రమ సంబంధాలు పెట్టుకున్నా ఫరవాలేదు. కండోమ్స్ వాడండి– నో ప్రాబ్లెమ్– నేడే ఎయిడ్స్ నిర్మూలన దినం పాటించండి" మాకు మతిపోయింది.

అక్కడినుంచీ మా కాలనీ కెళ్ళడానికి ఏ బస్ ఎక్కాలా అని డయిరీ చూశాడు శాయిరామ్. టెలివిజన్ కంపెనీల బస్ ఎక్కాలని రాసి ఉందందులో.

అరగంటసేపు ఎదుర్చూసినా టెలివిజన్ కాదుగదా రేడియో బస్ కూడా రాలేదు. ఇక లాభంలేదని ఆటో ఎక్కాం నలుగురం– కొంత ఎక్స్‌ట్రా చార్జ్ ఇచ్చేట్లు మాట్లాడి.

కొంతదూరం వెళ్ళాక ఆటోడ్రైవర్ వెనక్కు తిరిగి "సుఖమైన బసకూ సొంత ఇంటి వసతులకూ– హొటల్ ఛత్రపతిలోనే దిగండి! అనురాగంతో మిమ్మల్ని సేవిస్తుంది హొటల్ ఛత్రపతి" అన్నాడు చిరునవ్వుతో.

మాకేం అర్థం కాలేదు. ఏదో చెప్పబోయి ఏదో చెప్పాడేమోలే అని సరిపెట్టుకున్నాం.

ఇంకాస్త దూరం వెళ్ళాక మళ్ళీ వెనక్కు తిరిగి మళ్ళీ అదే మాట్లాడాడు.

"వీడెవడో పిచ్చాడులాగున్నాడు! మనం ఆటోదూకి పారిపోవడం మంచిది" అన్నాడు రంగారెడ్డి అనుమానంగా.

ఎలాగోలా ప్రాణాలు బిగపట్టుకుని కూర్చున్నాం కాలనీ చేరేవరకూ! కాలనీలో దిగి చార్జి చెల్లించగానే మళ్ళీ మొదలు పెట్టాడువాడు. "సుఖమైన బసకూ సొంత ఇంటి వసతులకూ– హొటల్ ఛత్రపతిలోనే దిగండి! అనురాగంతో మిమ్మల్ని సేవిస్తుంది హొటల్ ఛత్రపతి" అన్నాడు మళ్ళీ!

"ఆ హొటల్ పేరెందుకు చెప్తున్నావ్?" అన్నాడు రెడ్డి అనుమానంగా.

"అలా చెప్తే వాళ్ళు నాకు డబ్బు ఇస్తారండీ! ప్రతి పాసింజర్‌కి పబ్లిసిటీ చేస్తూండాలి నేను. మర్చిపోకండి! అనురాగంతో మిమ్మల్ని సేవిస్తుంది హొటల్ ఛత్రపతి" అంటూ కాలనీ దగ్గర ఆపీ మీటర్ ఛార్జీమీద ఎక్స్‌ట్రా తీసుకుని వెళ్ళిపోయాడతను.

మేము ఎవరింటికి వాళ్ళు చేరుకున్నాం. మా ఇంటి ముందు తులపులకు అడ్డంగా పెద్దబోర్డులు కనిపించినయి. వాటిమీద పెద్ద తాటికాయంత అక్షరాలు. అక్షరాల మధ్యలో

నుంచి ఇంట్లో కెళ్ళడానికి చిన్న తలుపులు రెండు కనబడుతున్నాయి.

"సువేగా గాస్ స్టవ్‌లు- కూరగాయలను కసిగా తరిగే ఏకైక గాస్‌స్టవ్ సువేగా! "గా" అనే అక్షరాలు మధ్య నుంచి దూరి వెళ్ళిలోపలకు వెళ్ళేసరికి మా ఆవిడ ఆనందంగా గులాబ్‌జామ్ తింటోంది. "బయట అడ్డంగా ఆ బోర్డు ఎవరు పెట్టారు?" చిరాకుగా అడిగాను.

"అయ్యో! అదేంటండీ! వాళ్ళ బోర్డులు మన కాలనీలో అందరిళ్ళకు ముందు తగిలించారుగా!"

"అదేనేనడిగేది! ఎందుకు పెట్టారు అని"

"అవి అలా పెట్టనిచ్చినందులకు మనకు పెద్ద గులాబ్‌జామ్ పాకెట్ ఉచితంగా ఇచ్చారండీ! అలా నెలకొకటి ఇస్తారట! పిల్లలు ఆనందంగా గులాబ్‌జామ్ తింటుంటే చూసి ఏమీ మాట్లాడలేక పోయాను. ఆ బోర్డులో నుంచి 'గా' అనే అక్షరం మధ్య నుంచే వెళ్ళటం, రెండు మూడుసార్లు ప్రాక్టీస్ చేశాను!

రాత్రి పది గంటలకు కాలనీ బయట ఎదరో అరుస్తూండటం వినిపించి కిటికీ తెరిచి చూశాను! శ్యామ్‌రావ్‌గారూ, వాళ్ళబ్బాయితో సహా కాలనీ అంతా తిరుగుతూ "రాత్రిళ్ళు పడుకునే ముందు- మీరందరూ "వేపిక్స్" సేవించండి. ఆలసటను పోగొట్టి, ఆత్రుతను లేవగొడుతుంది. మర్చిపోకండి "వేపిక్స్-వేపిక్స్-" అని అరుస్తున్నారు.

నాకు అర్థమయింది. ఆ కంపెనీవారు శ్యామ్‌రావ్ ద్వారా చేయిస్తున్న మరో పబ్లిసిటీ వ్యవహారం ఇది. నిద్రపోవడానికి ఉపక్రమించి లైటార్పబోయేసరికి ఎదురుగ్గా గోడమీద పెద్దవెల్తురు కనిపించి అదిరిపడి లేచి కూర్చున్నాను.

"నిరోధ్ వాడండి! సర్వకాల సర్వావస్తలయందు ఉపయోగపడుతుంది నిరోధ్!" అని చెప్తోంది అమ్మాయి గోడమీద నిలబడి. ఆ తర్వాత ఠక్కున మాయమయిపోయింది.

'ఆ తరువాత నేను నిద్ర కుపక్రమించాను అర్ధరాత్రి మా ఆవిడ నన్ను భయం భయంగా లేపింది. లేచి "ఏమిటి సంగతి" అని అడిగాను.

"చదవండి! వెంటనే చదవండి! హ్యామరాలజీ! మీ జీర్ణశక్తి అభివృద్ధికి హ్యామరాలజీ" అంటున్నారండీ ఎవరో అంది కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ.